క్లుప్తంగా

ప్రగతికి తొలి మెట్టు వాల్‌పోస్టర్ విడుదల



తాడూరు: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట బుధవారం ప్రగతికి తొలి మెట్టు వాల్‌పోస్టర్‌ను యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలు, వైజ్ఞానిక ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథం, ప్రగతి చైతన్యం, శాస్త్రీయ భావాలు వివిధ అంశాలను వాల్ పోస్టర్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక, తెలంగాణ ఆల్‌ఇండియా పీపుల్ సైన్స్ నెట్‌వర్క్ కార్యక్రమంలో భాగంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, కురుమయ్య, అనీల్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీకాంత్, వెంకటయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

మహిళపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి తండాకు చెందిన మహిళ మూడావత్ జమికి బుధవారం సారాను అక్రమంగా తరలిస్తోంది. కాంసానిపల్లి సమీపంలోని చీకటి వాగు వద్ద పోలీసులకు ఆమె పట్టుబడింది. మహిళ నుంచి ఎనిమిది లీటర్లు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

పుస్తకాల పంపిణీ



కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో 8 వతరగతి చదువుతున్న విద్యార్థులకు క్లాస్ మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ఎంట్రెన్స్ పుస్తకాలను అందజేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 8 వతరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్ అర్హత కోసం ప్రతి ఏడాది పరీక్ష నిర్వహిస్తుందన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి నాలుగు సంవత్సరాల పాటు, ప్రతి నెలా రూ.1000 చొప్పున ఉపకార వేతనం అందిస్తుందన్నారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు పతంజలి శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అర్థం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కల్వకుర్తిరూరల్: పట్టణానికి చెందిన దేవమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం బాధిత కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు సూర్యప్రకాష్‌రావు, మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్, మధు, రుక్కయ్య, వెంకటేష్ యాదవ్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో కోడె దూడ, గేదె మృతి



లింగాల: మండలంలోని వేర్వేరు ప్రాంతాలలో బుధవారం విద్యుదాఘాతంతో కోడె దూడ, గేదె మృతి చెందాయి. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని జీల్గుపల్లి స్వామికి సంబంధించిన కోడె దూడ వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.40 వేల వరకు ఉంటుందని రైతు పేర్కొన్నారు. లింగాలకు సమీపంలో జరిగిన మరో ఘటనలో చెంచెట్టి నరేష్‌కు సంబంధించిన పాడి గేదె వ్యవసాయ బోర్‌కు సంబంధించిన కరెంట్ వైర్లకు తాకి మృతి చెందింది. దీని విలువ రూ.90 వేలు ఉంటుందని యజమాని తెలిపారు.

బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం

కల్వకుర్తిరూరల్/తాడూరు: బీఎస్పీతోనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని కల్వకుర్తి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సుద్దకల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రమేష్, లక్ష్మమ్మ, సైదమ్మ, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. తాడూరు మండలం ఐతోల్‌లో రైతురాజ్యం జిల్లా అధ్యక్షుడు కొత్త బాలు ప్రచారం నిర్వహించారు.

మూగజీవాలకు గ్రాసం కొరత



లింగాల సమీపంలో అటవీ ప్రాంతానికి మూగజీవాలను తీసుకెళ్తున్న కాపరులు

లింగాల: మండలంలోని నల్లమల ప్రాంతానికి మూగజీవాలు మేత కోసం వలసలు వస్తున్నాయి. మైదానం ప్రాంతంలో గ్రాసం లేక మూగ జీవాలు గొర్రెలు, మేకలు అల్లాడుతున్నారు. యజమానులు మందలతో సుదూర ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. వనపర్తి, గోపాల్‌పేట, నర్సాయపల్లి, ఎత్తం, కొల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి అటవీ ప్రాంతానికి మూగ జీవాలను తరలిస్తున్నారు. రోజుల తరబడి అటవీ ప్రాంతంలోనే ఉంటూ వాటిని కాపాడుకుంటున్నారు యజమానులు. మైదానం ప్రాంతంలో సరైన వర్షాలు కురువక మేత కొరత ఏర్పడిందని దీంతో స్వగ్రామాన్ని ఇంటిని వదిలి రోజులు నెలల తరబడి అడవిలో ఉండాల్సి వస్తుందని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు అటవీ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని మూగజీవాల యజమానులు వాపోతున్నారు. జీవాల కోసం మేత పంపకానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గెలుపు కోసం కలిసి కట్టుగా పనిచేయాలి



కోడేరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరి ఉమ



ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల ఉప సర్పంచ్ నరేష్‌తో పాటు పలువురు నాయకులు, పాన్‌గల్ మండలంలోని జమ్మాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని, అవి కొనసాగాలంటే మరోమారు బీఆర్‌ఎస్‌కు అధికారం ఇవ్వాలని కోరారు. అలాగే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మద్దతుగా ఆయన తల్లి బిచ్చమ్మ కొల్లాపూర్ పట్టణంలో, భార్య విజయ చిన్నంబావి మండలంలో, సోదరీమణులు ఉమ, వీణ కోడేరు మండలంలో, నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త రంగినేని అభిలాష్‌రావు పాన్‌గల్ మండలంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరోసారి హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే కొల్లాపూర్ ప్రగతి పథంలో దూసుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, సోమ్‌నాథ్‌నాయక్, చంద్రశేఖర్‌నాయక్, రామ్మూర్తినాయుడు, దామోదర్‌రెడ్డి, శేఖర్, మదన్‌మోహన్‌గౌడు, రాముయాదవ్, ఎద్దుల సురేందర్‌రెడ్డి, కోదండం, తిరుపతయ్య, గాలన్న, బొజ్జన్న పాల్గొన్నారు.

కూచుకుళ్లకు మద్దతుగా ప్రచారం



తెలకపల్లి/తాడూరు: మండల కేంద్రమైన తెలకపల్లితోపాటు వివిధ గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి మద్దతుగా బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేగా రాజేష్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. తాడూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాజేస్‌రెడ్డికి మద్దతుగా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రోహిణి ప్రచారం చేశారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, గుగ్గిళ్ళ ప్రకాష్, రాముడు, స్వామి, రామకృష్ణ, శేఖర్, వసంత పాల్గొన్నారు.

సాయుధ బలగాలతో రూట్‌మార్చ్

అచ్చంపేట రూరల్: శాంతియుత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎస్పీ కృష్ణకిషోర్ కోరారు. బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారి గుండా సాయుధ బలగాలతో రూట్‌మార్చ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 144 సెక్షన్, సీఆర్‌పీసీ సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలకు మనోధైర్యం కల్పించడానికే రూట్‌మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను భంగం కల్గించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ అనుదీప్, ఎస్ఐలు గోవర్ధన్, గురుస్వామి, శేఖర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను విస్మరించడం దురదృష్టకరం



మాట్లాడుతున్న కుంభం మల్లేష్‌గౌడ్

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత శాసన సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసీలకు సీట్ల కేటాయింపులో అన్యాయం చేశారని జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సంక్షేమాన్ని మరిచిన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్న రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ కుల గణనతోపాటు బీసీలకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి చట్ట సభలలో రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు తాళ్ల నిరంజన్, రవీందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, నిరంజన్‌యాదవ్, సుధాకర్‌గౌడ్, కొత్త శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన కొండలు(36) కొత్తపేట స్టేజీవద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన కొల్లాపూర్‌లో తన పని ముగించుకుని బైక్‌పై ముష్టిపల్లికి వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చూసిన కొత్తపేట గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక లాభాలు



బీరసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త ఆదిశంకర్

బిజినేపల్లి: బీరసాగులో ఆధునిక పద్ధతులు అవలంభిస్తే అధిక లాభాలు సాధించవచ్చని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యానవన శాస్త్రవేత్త డా.ఆదిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖానాపూర్‌లో బీరసాగులో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ఆదిశంకర్ మాట్లాడుతూ రైతులు మెలైన బీర రకాలను ఎంపిక చేసుకోవాలని, బీర తీగ ఏర్పడే సమయంలో పందిరి ఏర్పాటు, డ్రిప్‌తో నీటి తడులు, ఏరువుల పంపిణీ, మల్చింగ్ వంటి పద్ధతులు పాటించాలన్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.శైల, రైతులు పాల్గొన్నారు.

పత్తి తీసేందుకు ఇతర ప్రాంతాలకు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల నుంచి వ్యవసాయ కూలీలు పత్తి తీసేందుకు వాహనాలలో ఇతర ప్రాంతాలకు తరలివెళ్తూ ఉపాధి పొందుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని తాడూరు, ఇంద్రకల్, గుంతకోడూరు, తెలకపల్లి, యాదిరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు మండలం నుంచి 2000 మంది కూలీలు ప్రైవేటు వాహనాలలో వలస వెళ్లి పత్తి తీస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఎక్కువ శాతం రైతులు వరినాట్లు వేశారు. దీంతో కూలీలకు పని దొరకడం లేదు. దీంతో మండలం నుంచి తిరుమలాపూర్, వెనచర్ల, పెద్దకొత్తపల్లి, బాచారం, జొన్నలబొగుడ, సాతాపూరు, గంట్రావ్‌పల్లి, నారాయణపల్లి, కల్వకోల్ గ్రామాల నుంచి కూలీలు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లి కూలీ పని పూర్తయ్యాక ఇంటికి వస్తున్నారు. ఒక్కో కూలీకి రూ.350లతో పాటు ఆటోచార్జీలు ఇవ్వడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం

సాక్షి, నెట్‌వర్క్: లింగాల, ఉప్పునుంతల మండలాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఆరు గ్యారంటీ పథకాలపై అవగాహన కల్పించారు. జిన్‌కుంట మాజీ ఎంపీటీసీ సభ్యులు గోరటి సుదర్శన్ బీఆర్‌ఎస్ నుంచి డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.అదేవిధంగా వంశీకృష్ణ గెలుపొందాలని బల్మూరు మండలంలోని గుడిబండ రామలింగేశ్వరస్వామికి, దోమలపెంటలోని ఎడమపాతాళగంగ వద్ద ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

సాక్షి, నెట్‌వర్క్: చారకొండ మండలం జూపల్లి, నెమలిగుట్ట తండా, దొంగలగుట్ట తండా, జేపల్లి, ఎర్రవల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామాల్లో బుధవారం కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. జూపల్లి 200 మంది, చంద్రాయన్‌పల్లిలో 50, గోకారంలో 100, ఎర్రవల్లిలో 50, బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు సభ్యులు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజి సింగ్, వెంకటయ్య యాదవ్, సంజీవ్ యాదవ్, సర్పంచ్‌లు మల్లీశ్వరి, వసంత, మాధవి కార్యకర్తలు ఉన్నారు.

ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి

పెంట్లవెల్లి: వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్ రావు కోరారు. మంగళవారం రాత్రి జటప్రోల్, పెంట్లవెల్లి గ్రామాలలో బీజేపీ పరివర్తన సభలో ఆయన మాట్లాడారు. సంవత్సరం లోపు కొల్లాపూర్‌లో 100 కంపెనీలతో పారిశ్రామిక జోన్ ఏర్పాటు చేసి 10 వేల మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, రోజారమణి, భరత్‌చంద్ర, ఖలీల్, వెంకట్‌స్వామి, మూలె వెంకటేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఉప్పునుంతల: ఏకలవ్య పందుల (పిగ్గరీ) సహకార సంఘం మండల కమిటీని బుధవారం స్థానిక పశువైద్యాధికారి నరేందర్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మేడం తిర్పతయ్య ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కుంభం అంజనేయులు, మేడపు రజిత, వలిగి లలిత, శివ, మేడపు నాగరాజు, మేడపు వీరయ్య, వలిగి తిర్పతయ్య, కుర్మయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు కూరాకుల శ్రీనివాస్, అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడు వలువాయి మల్లేష్ పాల్గొన్నారు.

సారవంతమైన మట్టి నింపాలి

పాన్‌గల్: మొక్కల పెంపకానికి కవర్లల్లో సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని దొండాయిపల్లి పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మట్టి, కవర్లను పరిశీలించారు. కవర్లలో నింపే మట్టిని జల్లెడ పట్టి నింపాలన్నారు. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపులా హరిత హారంలో నాటిన మొక్కలకు పాదులు తీసి క్రమం తప్పకుండా నీటిని పట్టాలని ఆదేశించారు.

రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిర్వహించారు. తెలకపల్లి, పెంట్లవెల్లి మండల కేంద్రాల్లో కేట్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.

మైసమ్మ దేవతకు ప్రభుత్వ విప్ పూజలు

సాక్షి, నెట్‌వర్క్: బల్మూరు మండలంలోని జిన్‌కుంట కనకాల మైసమ్మ అమ్మవారికి అచ్చంపేట బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బుధవారం నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కరుణాకర్‌రావు, కార్యకర్తలు ఉన్నారు. ఉప్పునుంతల, దోమలపెంట, మన్ననూరులో ఆ పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు.

పారదర్శకంగా పనిచేశా

కల్వకుర్తిరూరల్: అవినీతి, అక్రమాలు, రాజకీయ కక్షలకు తావులేకుండా పనిచేశానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో మూడో సారి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎన్నికల ఖర్చుకోసం కల్వకుర్తి గ్రామపంచాయతీ మాజీ ఇన్‌చార్జ్ సర్పంచ్ రాంరెడ్డి 10 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. మండలంలోని లింగసానిపల్లికి చెందిన 100 మంది, వెంకటాపూర్‌కు చెందిన 50 మంది ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. మండలంలోని వేపూరులో వైస్ ఎంపీపీ గోవర్ధన్ సమక్షంలో 50 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఆలోచించి ఓటు వేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం

నాగర్‌కర్నూల్/కందనూలు/తెలకపల్లి: నియోజకవర్గ ప్రజలు ఓటు వేసే ముందు ఎవరికి ఓటు వేస్తే అభివృద్ధి చెందుతుందో ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బుధవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రిటర్నింగ్ కార్యాలయంలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం వారు మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పడ్డాక నియోజకవర్గంలో వలసలు తగ్గాయన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంటపొలాలకు సాగునీరు అందుతుందన్నారు. నాగర్‌కర్నూల్‌కు ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కలాశాల, ఐటీ హబ్ రావాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా మర్రి జనార్దన్‌రెడ్డికి మళ్ళీ అవకాశం ఇవ్వాలని కోరారు. మర్రి జనార్దన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు కౌన్సిలర్ సుల్తాన్, 1వ వార్డు కౌన్సిలర్ ఇందిర శ్రీను, పెద్దపూర్ ఎంపీటీసీ కవిత, సుధాకర్, అల్లపూర్ ఎంపీటీసీ కరుణాకర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ మద్దెల చంటి, కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తెలకపల్లి మండల కేంద్రంతోపాటు ఆలేరు, రాకొండ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ విజయ

వెల్దండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ విజయ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకెళ్లారు. పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శాంతి, ఎంపీటీసీలు మోతిలాల్‌నాయక్, చక్రవర్తిగౌడ్, ఆయశాఖల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి, మాందాపూర్ ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. దీంతో పాటు ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించారు. నిబంధనల మేరకు అన్ని వసతులను ఏర్పాటు చేయాలని వారు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

వీపనగండ్ల: గ్రామాల్లోని బీఎల్ఓలు ఎన్నికల నిబంధనలను అనుసరించి పని చేయాలని తహసీల్దార్ వరలక్ష్మి బీఎల్ఓలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టుల తయారీ, అర్హులైన వారిని ఓటర్ జాబితాలో చేర్పించడం వంటి అంశాలను క్షేత్రస్థాయి పరిశీలన చేసుకొని తుది జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్‌లో వెన్నచర్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లక్ష్మణ్‌గౌడ్, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు నాగరాజు, కాంగ్రెస్ నాయకులు బొందయ్యతో పాటు 50 మంది కార్యకర్తలు మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు. అదేవిధంగా చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు 50 మంది కార్యకర్తలు, కొత్తయాపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాము యాదవ్ 40 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గణేష్‌రావు, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ పవన్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి..

సాక్షి, నెట్‌వర్క్: తెలకపల్లి మండలంలోని కొత్తపల్లి సుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజునాయక్, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బోడ రాములు, బంగారయ్య, చింతకృష్ణయ్య, చీర్ల లక్ష్మయ్య, అనీల్, మహేష్, సురేష్, శ్రీకాంత్, బానుప్రకాష్, జయసూర్య తదితరులు బుధవారం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సమక్షంలో చేరారు. అదేవిధంగా పెద్దకొత్తపల్లి మండలం నారాయణపల్లికి చెందిన మాజీ సర్పంచ్ పార్వతమ్మ, 50 మంది, దేవల్‌తిరుమలాపూర్‌కు చెందిన 30 మంది, పెంట్లవెల్లి మండలం గోపాలాపురం గ్రామానికి చెందిన 200 మంది బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. తిమ్మాజిపేట మండలంలో పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆర్టీసీ డీఎం, సిబ్బంది

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట ఆర్టీసీ డీఎం పి. మురళిదుర్గాప్రసాద్ కోరారు. బుధవారం డిపో కార్యాలయంలో కార్తీకమాసం సందర్భంగా శైవక్షేత్రాలకు వెళ్లే బస్సు సర్వీసులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అచ్చంపేట నుంచి శబరిమలకు, అరుణాచలం, తిరుపతి వంటి ప్రదేశాలకు అడ్వాన్సు బుకింగ్ ద్వారా బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లతో అన్ని సౌకర్యాలు, మంచి కండీషన్ ఉన్న బస్సులను పంపిస్తామన్నారు. అలాగే గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్‌ను ఆర్టీసీ అధికారులు, సిబ్బంది స్వీకరించి ఉత్తమమైన సర్వీసు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పీటీ కుమార్, కృష్ణయ్య, పీఎస్ దేవి, చంద్రయ్య, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.